క్లుప్తంగా

డ్రైనేజీ పనులు ప్రారంభం



పనులు చేస్తున్న సిబ్బంది

సాక్షి స్పందన

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని సుభాష్ విగ్రహం వద్ద డ్రైనేజీ నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదని 'సాక్షి' దినపత్రికలో బుధవారం 'నిర్లక్ష్యానికి నిదర్శనం' శీర్షికన ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. డ్రైనేజీ నిర్మాణపు పనులను గురువారం ప్రారంభించారు. 'సాక్షి'కి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

ఆటోడ్రైవర్ల దినోత్సవం



వేడుకల్లో ఎస్సై, ఆటోడ్రైవర్లు

రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఆటోడ్రైవర్ల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆటోడ్రైవర్లు కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ముఖ్య అతిథిగా హాజరైన రామగుండం ఎస్సై సమ్మయ్యను సత్కరించారు. ఎస్సై మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ ట్రాఫిక్ నిబంధనలకు లోబడి వ్యవహరించాలన్నారు. ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. ఆటోడ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు ఎండీ.రహీం, సాగర్, రజాక్, యూసుఫ్, నిజాం, శ్రీనివాస్, రాయల చౌదరి పాల్గొన్నారు.

పోచమ్మ బోనాలు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గర్రెపల్లిలో జీపీరావు కాలనీవాసులు గురువారం పోచమ్మతల్లికి బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి వెళ్లి బోనాలు నైవేద్యంగా పెట్టి మొక్కులు చెల్లించారు.

పైపులైన్ లీకేజీ



రోడ్డుపై నిలిచిన నీరు

మంథని: మంథని అంబేడ్కర్ చౌక్‌లో కొన్ని రోజులుగా నీటి పైపులైన్ లీకై నీరు వృథాగా పోతోంది. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అయితే రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రోడ్డు పాడవుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని, అధికారులు దృష్టి సారించాలని న్యాయవాది, మంథని మేజర్ పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ ఇనుముల సతీశ్ కోరారు.

ఎంపీ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఓదెల: కాజీపేట్ నుంచి బల్లార్షా సెక్షన్ల మధ్యలో నడిచే అజ్నీ ప్యాసింజర్‌ను ఓదెల రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ కల్పించాలని, కరీంనగర్ టూ తిరుపతి రైలు ఆపాలని ఎంపీ గడ్డం వంశీకృష్ణ పార్లమెంట్‌లో పీఎం మోదీ, రైల్వేశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఓదెలలో ఎంపీ ఫొటోకు స్థానిక కాంగ్రెస్ నాయకులు గురువారం క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ నాయకులు అల్లం సతీశ్, గోపతి ఎల్లయ్య, మార్క సతీశ్, బోయ సంతోష్, గుర్రాల శ్రీధర్, కోటగిరి స్వామి, రాచర్ల ఓదెలు ఉన్నారు.

పాఠశాల పాత సామగ్రికి వేలం

ఎలిగేడు: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో పాతవి, పనికి రానివి, విరిగిపోయిన సామగ్రిని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ నిర్ణయం మేరకు వేలం వేయనున్నట్లు పాఠశాల హెచ్‌ఎం దేవేందర్‌రావు తెలిపారు. వేలంలో పాల్గొనే ఆసక్తి గలవారు శనివారం మధ్యాహ్నంలోపు ఎలిగేడు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో దరఖాస్తు అందజేయాలన్నారు. ఈనెల 5న ఉదయం 11గంటలకు పాఠశాలలో వేలం ఉంటుందని హెచ్‌ఎం పేర్కొన్నారు.

ప్రభుత్వ వైద్యుడిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ వైద్యుడిపై దాడిచేసిన వారిని అరెస్టు చేసి చట్టరీత్యా శిక్షించాలని మాజీ జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. కాల్వశ్రీరాంపూర్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దాడికి గురైన డాక్టర్ మహేందర్ కాల్వశ్రీరాంపూర్‌లో ఉత్తమమైన వైద్యసేవలు అందిస్తున్నారని, అలాంటి వైద్యుడిపై దాడిచేసిన వారిని అరెస్టు చేసి శిక్షించకుంటే ఆందోళన చేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, మాజీ ఎంపీటీసీ తూండ్ల రాజయ్య, మాజీ సర్పంచ్ ఆడెపు రాజు, నూనేటి కుమార్‌యాదవ్, ధర్మల రవి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై నిలిచిన నీటిని తొలగించండి సారూ

జూలపల్లి: మండలంలో రాత్రి కురిసిన భారీ వర్షానికి చీమలపేటలో రోడ్డుపైనే నీరు నిలిచింది. దీంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం నీరు రోడ్లపై నిలిచి దోమలు పెరిగి, జ్వరాల బారిన పడుతున్నామని, నీటిని తొలగించండి సారూ అంటే స్థానికులు విన్నవిస్తున్నారు. పంచాయతీ అధికారులు మోటార్లతో నీటిని పంపింగ్ చేసినా వర్షం పడుతుండడంతో నీరు నిల్వ తగ్గడం లేదని వారు వాపోతున్నారు. అధికారులు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఘనంగా తీజ్ ఉత్సవాలు

పాలకుర్తి: మండలంలోని బామ్లానాయక్‌తండా పంచాయతీ పరిధిలోని రాజీవ్‌తండాలో గురువారం తీజ్ ఉత్సవాలను గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు. గిరిజనుల ఆరాధ్యదైవమైన సేవాలాల్ మహారాజ్, మేరమా తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. గోధుమనారు బుట్టలతో ఊరేగింపు నిర్వహించి అనంతరం నిమజ్జనం చేశారు. మాజీ ఉపసర్పంచ్ బదావత్ జ్యోతి-శంకర్ దంపతులు ఉత్సవ నిర్వహణకు విరాళం అందించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య, మాజీ సర్పంచ్ బదావత్ రాజునాయక్, మాజీ ఉపసర్పంచ్ తిరుపతి పాల్గొన్నారు.

రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



మొక్క నాటి నీళ్లు పోస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

ఓదెల: రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్ లాల్ ఆదేశించారు. ఓదెల తహసీల్ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో పెండింగ్‌లో ఉన్న భూసమస్యలు త్వరగా పరిష్కరించాలన్నారు. అనంతరం కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. తహసీల్దార్ యాకయ్య, డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

పరిహారంపై అధికారులు ఇబ్బంది పెడుతున్నారు



మంత్రికి విన్నవిస్తున్న భూ నిర్వాసితులు

రామగిరి: ఆర్‌అండ్‌ఆర్ పరిహారంపై సింగరేణి అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని గురువారం మంత్రి శ్రీధర్‌బాబును లద్నాపూర్ గ్రామస్తులు హైదరాబాద్‌లో కలిసి విన్నవించారు. గతంలో అధికారులు కమిటీ వేసి చర్చలకు రావాలని తెలిపారని మళ్లీ పరిహారం విషయంలో స్పందించడం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆర్‌అండ్‌ఆర్ పరిహారం విషయంపై అధికారులతో మాట్లాడి తమకు న్యాయం చేయాలని కోరారు. కాగా మంత్రి వెంటనే స్పందించి ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు వనం రాంచందర్‌రావు, బీ.వీ.స్వామిగౌడ్, బర్ల శ్రీనివాస్, తొగరి లింగయ్య, మేడగాని రాంచందర్, సత్యనారాయణ, శ్రీనివాస్, జమీల్ ఉన్నారు.

కార్మికులను మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

యైటింక్లయిన్‌కాలనీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి కార్మికులను మోసం చేస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కమిటీ నాయకుడు ఎస్.వీరయ్య ఆరోపించారు. యైటింక్లయిన్‌కాలనీ ప్రెస్‌భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణి బొగ్గుగనులను వేలం వేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వ మాత్రం వ్యతిరేకిస్తున్నామని చెప్పుకుంటూ వేలంలో పాల్గొనడంపై ఆయన మండిపడ్డారు. శ్రావణపల్లి బొగ్గుబ్లాకు వేలాన్ని రద్దు చేసి సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో సింగరేణివ్యాప్తంగా జూలై 29 నుంచి ఆగస్టు 5 వరకు సింగరేణి పరిరక్షణ యాత్ర అనే పేరుతో బస్సు యాత్రను చేపట్టిందన్నారు. బస్సు యాత్రలో ప్రజలు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, ఆశయ్య, జిల్లా కార్యదర్శి యాకయ్య, ముత్యంరావు, నరసింహారావు, మహేశ్వరి, మొగిలి, వినయ్, వెంకన్న, ప్రణయ్, శ్రీనివాస్, కొమురయ్య, విజయ్‌కుమార్, రాజయ్య పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై పార్టీలకు అతీతంగా సంబరాలు



గోదావరిఖనిటౌన్: సంబరాల్లో నాయకులు



సుల్తానాబాద్‌లో స్వీట్లు తినిపించుకుంటూ..

గోదావరిఖనిటౌన్: సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ విషయంలో గురువారం వెలువరించిన తీర్పును స్వాగతిస్తూ స్థానిక ప్రధాన చౌరస్తాలో గురువారం రాత్రి పార్టీలకు అతీతంగా దళిత సంఘాలు సంబరాలు జరుపుకుని స్వీట్లు పంపిణీ చేశారు.

గోదావరిఖనిటౌన్: సుప్రీంకోర్టు ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పుపై గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో మాదిగ జన చైతన్య సమితి ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. జిల్లా అధ్యక్షుడు రమేశ్, కార్పొరేషన్ అధ్యక్షుడు జైష్‌కుమార్ ఉన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మాదిగ పోరాట సమితి నాయకులు కాల్వశ్రీరాంపూర్‌లో గురువారం సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, అంబేడ్కర్ సంఘం, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు చుక్క రాజమౌళి పాల్గొన్నారు.

బీజేపీ, బీఎంఎస్ నాయకుల హర్షం

యైటింక్లయిన్‌కాలనీ: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు నిర్ణయాన్ని హర్షిస్తూ గురువారం యైటింక్లయిన్‌కాలనీ బీజేపీ, బీఎంఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు.

ఉద్యోగులకు విరమణ తప్పనిసరి



జ్ఞాపిక బహూకరిస్తున్న ఎస్ఈ విజేందర్

రామగుండం: ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి విరమణ తప్పనిసరి అని బీథర్మల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.విజేందర్ అన్నారు. బీ-థర్మల్ కేంద్రంలో గురువారం అకౌంట్స్ ఆఫీసర్ ఆరుముల్ల భూమయ్య ఉద్యోగ విరమణ వేడుకలకు ఆయన అతిథిగా హాజరయ్యారు. మాట్లాడారు. ఈ సందర్భంగా భూమయ్యకు చిరు సత్కారంగా జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో బీ-థర్మల్ ఇంజనీర్లు శంకరయ్య, బాలకృష్ణ, సత్య శ్రీనివాస్, భాస్కర్‌రావు, సూర్యనారాయణరెడ్డి, కృష్ణమూర్తి, అనిత, శైలజ, సరిత ఉన్నారు.

మళ్లీ మారిన బల్దియా సూపర్‌వైజర్ల జోన్లు



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీకాంత్

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలోని శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న సూపర్‌వైజర్ల జోన్ల మార్పుల అయోమయంపై గతనెల 30న 'సాక్షి'లో వచ్చిన కథనంపై బల్దియా కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ స్పందించారు. శానిటేషన్ సూపర్‌వైజర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. జోన్ల వారీగా కేటాయించిన డివిజన్లలో శానిటేషన్‌ను మెరుగుపర్చాలని ఆదేశించారు. శుక్రవారం నుంచే సూపర్‌వైజర్లు వారికి కేటాయించిన కొత్త జోన్లలో పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.

పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

ఎలిగేడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వరల్డ్ లంగ్ క్యాన్సర్‌డేను పురస్కరిచుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు.

సింగరేణి లాభాల్లో కార్మికులకు వాటా ప్రకటించాలి



మాట్లాడుతున్న మిర్యాల రంగయ్య

రామగిరి: సింగరేణి కార్మికులకు 2023-24లో సాధించిన లాభాల్లో 35శాతం వాటా ప్రకటించాలని ఏఐటీయూసీ అడిషనల్ జనరల్ సెక్రటరీ మిర్యాల రంగయ్య డిమాండ్ చేశారు. ఆర్జీ-3 పరిధిలోని ఓసీపీ-2లో బ్రాంచ్ సెక్రటరీ ఎంఆర్సీ రెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఓసీపీ-2 గని ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందడం బాధాకరమని, ప్రమాదానికి కారకులైన అధికారులపై చర్యలు తీసువాలని కోరారు. డిప్యూటీ జనరల్ సెక్రటరీ వై.వి.రావు, సెంట్రల్ సెక్రటరీ రాంచందర్, పిట్ సెక్రటరీ వెంకటస్వామి, సంపత్, రాజు, సురేందర్, సాదిక్, రాజయ్య పాల్గొన్నారు.

లాభాల్లో వాటా చెల్లించాలి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కార్మికులకు 2023-24కి సంబంధించిన లాభాల్లో 35శాతం వాటా చెల్లించాలని గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయు) రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కోరారు. యైటింక్లయిన్‌కాలనీలో గురువారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్షిక సంవత్సరం గడిచి నాలుగు నెలలు అవుతున్నాఆ సింగరేణి యాజమాన్యం వాస్తవ లాభాలను ప్రకటించకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో అన్ని గనుల మేనేజర్లకు వినతిపత్రాలు ఇచ్చి, జీఎం కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేట్టనున్నట్లు పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేందర్, నాయకులు మల్లేశం, రాజేంద్రప్రసాద్, శేఖర్, రాజనర్సు, తిరుపతి, మల్లయ్య, రాజేశ్, దేవన్న పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగి సింగరేణి అభివృద్ధికి కృషిచేయాలి



మాట్లాడుతున్న జీఎం వెంకటేశ్వర్లు

రామగిరి: కార్మికులు క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని, ప్రతీ ఉద్యోగి సింగరేణి అభివృద్ధికి కృషి చేయాలని ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు సూచించారు. సుమారు 34 మందికి కారుణ్య నియామక ఉద్యోగ ఉత్తర్వులు అందజేయగా స్థానిక ఎంవీటీసీలో శిక్షణ పొందుతున్నారు. ఎంవీటీసీలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని జీఎం గురువారం పరిశీలించారు. అనంతరం శిక్షణ పొందుతున్న ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. ఉద్యోగంలో చేరిన తర్వాత క్రమం తప్పకుండా విధులకు హాజరుకావాలన్నారు. శిక్షణ పూరయిన వెంటనే ఇచ్చిన గడువులోగా విధుల్లో చేరాలన్నారు. అనంతరం ఆయన మొక్కలు నాటారు. ఎస్‌వోటూ జీఎం బి.సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్లు కె.మారుతి, ఎంవీటీసీ మేనేజర్ మల్లన్న, డీవైఎస్ఈ శ్రీనివాస్ ఉన్నారు.

గనిలో వెంటిలేషన్ సమస్య పరిష్కరించాలి



కార్మికులతో మాట్లాడుతున్న రియాజ్

గోదావరిఖని: జీడీకే-11గనిలో వెంటిలేషన్ సమస్య పరిష్కరించాలని హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. గురువారం గనిపైకి చేరుకుని కార్మికులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ప్రమాదాలు జరగకుండా పూర్తిస్థాయిలో రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉత్పత్తితో పాటు రక్షణకు పూర్తి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నాయకులు జక్కుల నారాయణ, కుమారస్వామి పాల్గొన్నారు.

కార్మికుల సొంతింటి కల నెరవేర్చాలి



మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సొంతింటి కల నెరవేర్చాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక ఫంక్షన్‌హాల్‌లో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన రామగుండం రీజియన్ ఐఎన్‌టీయూసీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణివ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న ముఖ్య సమస్యల పరిష్కారంపై యూనియన్ దృష్టి సారించిందన్నారు. కొత్త బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలన్నారు. నాయకులు నరసింహారెడ్డి, ధర్మపురి, కాంపెల్లి సమ్మయ్య, లక్ష్మీపతిగౌడ్, అక్రం, జెట్టి శంకర్‌రావు, కలవేన శ్యాం, వికాస్‌కుమార్‌యాదవ్, కొత్త సత్యనారాయణరెడ్డి, రవీందర్‌రెడ్డి, దేవి భూమయ్య, జోగా బుచ్చయ్య పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి

గోదావరిఖని: జీవో నెంబర్ 22గెజిట్ చేసి సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల రమేశ్ కోరారు. పలు ఏరియాల్లో గురువారం మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలపై ఇంతవరకూ నిర్ణయం తీసుకోలేదన్నారు. దీనిపై ఇప్పటికే కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతిపత్రాలు అందజేశామన్నారు. జీవోను వర్తింపజేస్తే కాంట్రాక్ట్ కార్మికులకు లాభం కలుగుతుందన్నారు. నాయకులు కొయ్యడ శంకర్, మాట్ల సమ్మయ్య, కళావతి, సతీశ్, కుమార్, శ్రీనివాస్, సారయ్య పాల్గొన్నారు.

పాఠశాలకు రూ.1.50లక్షల విరాళం



గోదావరిఖని టౌన్: పట్టణంలో సెక్రెట్ హార్ట్ పాఠశాల 1981-82 బ్యాచ్‌లో 7వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాల సైన్స్ ల్యాబ్, లైబ్రరీ కోసం రూ.1.50లక్షల విలువ గల చెక్కును గురువారం విరాళంగా అందించారు. పూర్వ విద్యార్థులు అనిష్‌గుప్తా, రాజీవ్ గంగూలీ, శీలా, గౌతమ్, సోమయాజులు, దేవేందర్‌రెడ్డి, మాటూరి శ్రీనివాస్, హేమ, రాధ, హెచ్.సీత, లిదియా, సంధ్యా, వెంకట్‌రెడ్డి, సత్యకీర్తి, ప్రిన్సిపాల్ ఉన్నారు.

ఎన్సీపీ జిల్లా అధ్యక్షుడిగా గోలివాడ

గోదావరిఖని: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) జిల్లా అధ్యక్షుడు, రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జిగా గోలివాడ ప్రసన్నకుమార్‌ను నియమించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ జాదవ్ గురువారం నియామక ఉత్తర్వులు జారీచేశారు.

సంక్షిప్త వార్తలు

ఆర్జీ-3లో 97శాతం బొగ్గు ఉత్పత్తి

రామగిరి: జూలైలో ఆర్జీ-3లో 97శాతం, ఏపీఏలో 292శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు గురువారం ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు ఎన్.సుధాకర్‌రావు, కొప్పుల వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. జూలైలో ఆర్జీ-3లో నిర్దేశించిన 4.19 లక్షల టన్నులకు గాను 4.08 లక్షల టన్నులు అనగా 97శాతం బొగ్గు ఉత్పత్తి, 57శాతం మట్టి తీయడం, 5.83 లక్షల టన్నుల బొగ్గురవాణా చేసినట్లు పేర్కొన్నారు. ఏపీఏ గనిలో జూలైలో నిర్దేశించిన 0.18 లక్షల టన్నులకు గాను 0.25 లక్షల టన్నులు అనగా 292శాతం బొగ్గు ఉత్పత్తి సాధించడంతో పాటు 0.59లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు వివరించారు.

గ్యాస్ ఏజెన్సీ సీజ్

పాలకుర్తి: కుక్కలగూడూరు గ్రామశివారులోని సూర్య గ్యాస్ ఏజెన్సీని గురువారం సీజ్ చేసినట్లు సివిల్ సప్లయ్ జిల్లా అధికారి ప్రేమ్‌కుమార్ తెలిపారు. గ్యాస్ ఏజెన్సీని తనిఖీ చేసేందుకు వచ్చిన తమకు సంబంధిత యజమాని సహకరించలేదని, దీంతో గోదాం సీజ్ చేశామన్నారు. శుక్రవారం మరోసారి తనిఖీ చేస్తామని ఆయన పేర్కొన్నారు.

ఎన్టీపీసీ రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

జ్యోతినగర్: విరమణ ప్రతీ ఉద్యోగికి సహజమని ఎన్టీపీసీ రామగుండం-తెలంగాణ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్‌పాండు అన్నారు. ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని కాకతీయ ఆడిటోరియంలో బుధవారం రాత్రి జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సంస్థలో ఉద్యోగం చేసి విరమణ పొందిన విష్ణువర్ధన్‌రావు, స్వామి, నాయుడు నాగేశ్వరరావు, ప్రభాకర్‌రావు, అబ్దుల్ కరీం, గౌతంకుమార్, డేవిడ్, శ్రీనివాసరెడ్డిని సన్మానించారు.

సీఎం దిష్టిబొమ్మ దహనానికి నిరసనగా టవర్ ఎక్కిన యువకుడు

సుల్తానాబాద్‌రూరల్/సుల్తానాబాద్: సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్ నాయకులు దహనం చేసినందుకు పట్టణానికి చెందిన కిరణ్ అనే యువకుడు మనస్తాపం చెంది గురువారం రాత్రి బస్టాండ్ వెనక ఉన్న సెల్ టవర్ ఎక్కాడు. ఆత్మహత్య చేసుకుంటానని స్థానిక నాయకులు బిరుదు కృష్ణ, అబ్బయ్యగౌడ్‌కు ఫోన్ చేసి చెప్పడంతో వారితో పాటు పోలీసులు వచ్చి కిరణ్‌ను సముదాయించడంతో కిందకు దిగాడు.

గణిత టీచర్లకు స్కూల్ కాంప్లెక్సు సమావేశం

జూలపల్లి: ఉపాధ్యాయులు ఆధునిక మెలకువలు పాటించి విద్యార్థులకు సులభతరమైన విధానంలో గణిత బోధన చేయాలని ఆర్పీలు రవీందర్, వీణ సూచించారు. మండలంలోని తేలుకుంట ఉన్నత పాఠశాలలో జూలపల్లితో పాటు ఎలిగేడు, సుల్తానాబాద్, ధర్మారం మండలాల్లోని యూపీఎస్, ఉన్నత పాఠశాలల గణిత ఉపాధ్యాయులకు గణిత బోధనపై స్కూల్ కాంప్లెక్సు సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎం రవీందర్ వీణ, తిరుపతి, శంకరయ్య పాల్గొన్నారు.

రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి

ముత్తారం: మండలంలోని 14గ్రామ పంచాయతీల్లో కొత్తగా తీసుకున్న పట్టా పాసుబుక్ రైతులు ఆగస్టు 5లోపు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి చిందం శ్రీకాంత్ తెలిపారు.

సీఎస్సార్ నిధులతో సీసీరోడ్ల నిర్మాణం

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు సీఎస్సార్ నిధులతో రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ న్యూపోరటపల్లిలో సీసీరోడ్ల నిర్మాణం జరుగుతుందని కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు ఈదునూరి మల్లేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

బదిలీ ప్రిన్సిపాల్‌కు సన్మానం

గోదావరిఖనిటౌన్: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేసి బదిలీపై మెదక్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు వెళ్తున్న మాధవిని అధ్యాపకులు గురువారం కళాశాలలో సన్మానించారు. అలాగే బదిలీ అవుతున్న అధ్యాపకులు ఫిజిక్స్ లెక్చరర్ శ్రీధర్, కామర్స్ లెక్చరర్ హస్మత్ అలీని సన్మానించారు. అనంతరం నూతన ప్రిన్సిపాల్‌గా వచ్చిన సంజీవయ్యకు స్వాగతం పలికారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్, మహేశ్ కోరారు. కలెక్టర్‌కు గురువారం వినతిపత్రం అందించారు. జర్నలిస్టుల పిల్లల చదువుకు ఫీజు రాయితీ ఇచ్చేలా ఆదేశాలివ్వాలని కోరారు. నాయకులు సాబీర్‌పాషా, తిరుపతిరెడ్డి, సుదర్శన్, సతీశ్, చంద్రమౌళి ఉన్నారు.

అయ్యప్ప ఆలయ అభివృద్ధికి విరాళం

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పీటీఎస్‌లోని అయ్యప్ప ఆలయం అభివృద్ధికి అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ రూ.5వేల విరాళం అందించింది.

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి

పెద్దపల్లిరూరల్: మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని జిల్లా సాధికారిత మిషన్ కోఆర్డినేటర్ దయా అరుణ కోరారు. పెద్దపల్లి మండలం హన్మంతునిపేటలో గురువారం కేంద్ర పథకాలపై అవగాహన కల్పించారు.

నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేపై అవగాహన

పాలకుర్తి: మండలంలోని కన్నాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే-2024పై ఆంగ్ల భాషాబోధన ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా రిసోర్స్‌పర్సన్ గడ్డం జగదీశ్వర్ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

హామీలను అమలు చేయాలి

ఎలిగేడు: గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికులకు కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని జీపీ కార్మికుల జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల లచ్చయ్య, మండల అధ్యక్షుడు తీట్ల శ్రీనివాస్ కోరారు. 8న గ్రామాల్లో సఫాయి బంద్ నిర్వహిస్తామని, కార్మికులు పాల్గొని విజయవంతం చేయలని కోరారు.

విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఆసంపెల్లి లక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 23 విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్, స్టేషనరీ వస్తువులు అందజేశారు.

బీఆర్‌ఎస్ నాయకుల నిరసన

పెద్దపల్లిరూరల్/కమాన్‌పూర్/సుల్తానాబాద్/మంథని: అసెంబ్లీలో సీఎం, డిప్యూటీ సీఎంలు బీఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ గురువారం బీఆర్‌ఎస్ నాయకులు నిరసన తెలిపారు. పెద్దపల్లి, కమాన్‌పూర్, సుల్తానాబాద్, మంథనిలోని నాయకులు సీఎం వ్యాఖ్యలను ఖండించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలి

సుల్తానాబాద్: రానున్న స్థానికసంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని బీజేపీ నియోజకవర్గ ప్రభారి పావునూరి పోచం, మండల అధ్యక్షుడు వేల్పుల రాజన్న పటేల్ కోరారు. మండల కేంద్రంలోని సాయిగార్డెన్‌లో గురువారం బీజేపీ మండల ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు వేల్పుల రాజన్నపటేల్, ఎస్సీసెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు లంక శంకర్ పాల్గొన్నారు.